ప్రజాశక్తి
మంగళవారం 25 నవంబర్ 2025
5
అనంతపురం

కలెక్టరేట్ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు

అంధుల టీ-20 క్రికెట్ ప్రపంచ కప్‌తో దీపిక

ఆమె లక్ష్యం ముందు వైకల్యం చిన్నబోయింది.. అనుకున్నది సాధించాలనే తపన విజయతీరాన్ని చేర్చింది... చూపు లేదంటూ చిన్నచూపు చూసిన వారికి తన విజయంతో సమాధానం చెప్పింది. పుట్టెడు దు:ఖాన్ని తన పట్టుదలతో జయించి అందరి చేత ఔరా అనిపించుకుంది. కుగ్రామం నుంచి మొదలైన ఆమె ప్రస్థానం దేశ క్రికెట్‌లో రథసారధిని చేసింది. సాధించాలనే తపన.. తల్లిదండ్రుల కోరిక నెరవేర్చాలనే కసి విజయ'దీపిక'గా మారి యువతకు ఆదర్శంగా నిలిచింది.

విజయదీపిక..!

- వైకల్యాన్ని జయించిన లక్ష్యం
- అంధుల క్రికెట్‌లో రాణించిన టిసి.దీపిక
- కుగ్రామం నుంచి దేశ క్రికెట్ సారథిగా ప్రస్థానం
- మహిళా అంధుల ప్రపంచకప్ గెలవడంలో కీలకపాత్ర
- మడకశిర ప్రాంతంలో హర్షాతిరేకాలు

ప్రజాశక్తి-అమరాపురం, మడకశిర టౌన్

టిసి.దీపిక... రెండు రోజుల క్రితం వరకు ఈ పేరు చాలా మందికి తెలియదు. క్రికెట్‌ను ఇష్టపడే వారిలో అతికొద్ది మందికి మాత్రమే ఈమె తెలుసు. అలాంటి అతి సాధారణ యువతి నేడు దేశం గుర్తించే స్థాయికి ఎదిగింది. చిన్న తనంలోనే చూపును కోల్పోయిన ఆమె పట్టుదలతో అనుకున్న లక్ష్యం వైపు పరుగులు తీసింది. తనకు ఇష్టమైన క్రికెట్‌లో సత్తా చాటి అందరి చేత మన్ననలు పొందుతోంది. దీపిక భారత దేశ అంధుల క్రికెట్ జట్టుకు నాయకత్వం వహించడమే కాకుండా దేశానికి తొలి అంధుల మహిళా టీ-20 ప్రపంచకప్‌ను అందించింది. చిరస్మరణీయమైన విజయాన్ని దేశానికి అందించిన యువతి శ్రీ సత్యసాయి జిల్లాకు చెందినది కావడంతో ఈ ప్రాంతం వాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

మట్టిలో మాణిక్యం

శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం మండలం హేమవతి పంచాయతీ తంబాలహట్టి గ్రామానికి చెందిన చిక్క తిమ్మప్ప, చిత్తమ్మ దంపతులకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు. వీరిలో మొదటి సంతానం దీపిక. వారికున్న రెండు ఎకరాల పొలంలోనే వ్యవసాయం, కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. దీపికకు ఐదు నెలల వయస్సున్నప్పుడు ఆమె చేతిగోరు తగిలి ఒక కంటి చూపును పూర్తిగా కోల్పోయింది. తల్లిదండ్రులు పలు ఆసుపత్రుల్లో చూపించినా చూపు దక్కలేదు. తొలి సంతానంలో జన్మించిన ఇంటి మహాలక్ష్మి కనుచూపు పోవడంతో తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఈ కష్టాన్ని దిగమింగుకుని తమ కూతురికి చూపు లేదన్న బాధను తెలియకుండా ఆమెను ఉన్నత స్థాయిలోకి చేర్చాలని తల్లిదండ్రులు చిక్క రంగప్ప, చిత్తమ్మ దంపతులు నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా ఆమెను బాగా చదవించాలనుకున్నారు. వీరి గ్రామం సత్యసాయి జిల్లాకు సరిహద్దున కర్నాటక రాష్ట్రానికి అతి సమీపంలో ఉంటుంది. దీంతో ఆమె విద్యాభ్యాసం అంతా కర్నాటకలోనే సాగింది. దీపిక దొడ్డబానిగేరలో ఒకటవ తరగతి నుంచి ఏడవ తరగతి, తుంకూర్ జిల్లా కునిగల్ అంధ కళాశాలలో డిగ్రీని పూర్తి చేసింది. క్రికెట్లో దీపిక ప్రతిభను గుర్తించి ఉపాధ్యాయులు పాఠశాల స్థాయి అనంతరం కర్నాటకలోని మైసూర్‌లో ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. అక్కడే అంధుల పాఠశాలలో చదువుతో పాటు క్రికెట్‌లోనూ రాటుదేలింది.

తల్లిదండ్రులతో దీపిక

చిన్నతనం నుంచే క్రికెట్‌పై మక్కువ

దీపిక చిన్నతనం నుంచే చదువుతో పాటు క్రికెట్‌పై మక్కువ పెంచుకుంది. 8వ తరగతిలో ఉండగానే పాఠశాల స్థాయిలో క్రికెట్ ఆడడం మొదలు పెట్టింది. 10 తరగతిలో ఉండగా అంధుల రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని సెంచరీ చేసింది. 2019లో జాతీయ అంధుల మహిళా జట్టు ప్రారంభమైంది. అదే సమయంలో కర్నాటక జట్టు కెప్టెన్‌గా ఎంపికైంది. ఆపై భారత జట్టులో చోటు సంపాదించింది. 2023లో ఇంగ్లాండ్‌లో జరిగిన ప్రపంచ అంధ మహిళ క్రికెట్ టీం-20 వరల్డ్ గేమ్స్(ఐబీ యస్ఎ)లో పాల్గొని అద్భుత ఆట తీరు కనబరిచింది. క్రికెట్‌లో చూపిన ప్రతిభతో ఆమెకు క్రీడాకోటాలో ముంబైలోని ఆదాయపు పన్ను శాఖ కార్యాలయంలో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం చేస్తూనే అంధుల టీ-20 ప్రపంచ కప్‌లో కెప్టెన్‌గా ఎంపికైంది. జట్టుకు నాయకత్వం వహించడమే కాకుండా బ్యాటర్‌గా రాణించి తొలి ప్రపంచకప్‌ను దేశానికి అందించడంలో కీలకపాత్ర పోషించింది.



దీపిక తల్లిదండ్రులను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

మడకశిర ఆణిముత్యం

మహిళ అంధుల టీ-20 కెప్టెన్‌గా దేశానికి తొలి ప్రపంచకప్‌ను అందించిన దీపిక మడకశిర ఆణిముత్యం. ఆమె ఈ ప్రాంత వాసికావడం ఎంతో గర్వకారణం. కూతురిని ఉన్నత స్థానంకు తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు చిత్తమ్మ, చిక్క తిమ్మప్పలు చేసిన కృషి అభినందనీయం. భవిష్యత్తులో దీపిక ఎదుగుదలకు తమవంతు సహకారం అందిస్తాం.

మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి.

మడకశిరను ప్రపంచానికి చాటింది

క్రికెట్ చరిత్రలో దీపిక భారతదేశానికి చారిత్రక విజయాన్ని అందించడం గర్వకారణ. ఆమె ఆత్మవిశ్వాసం, మనోధైర్యం, పట్టు సడలని సంకల్పాన్ని యావత్తు దేశం మెచ్చుకుంటోంది. అలాంటి యువతి మడకశిర ప్రాంత వాసి కావడం ఈ ప్రాంత వాసులకు ఎంతో ఆనందాన్ని ఇస్తోంది. ఎక్కడో మారుమూల ఉన్న మడకశిరను ఏకంగా ప్రపంచానికే పరిచయం చేసిన దీపిక సేవలు చిరకాలం గుర్తింటాయి.

ఎంఎస్.రాజు, మడకశిర ఎమ్మెల్యే.

గర్వంగా ఉంది

తమ బిడ్డ సాధించిన ఘనత చూస్తే చాలా గర్వకంగా ఉంది. క్రికెట్ ప్రపంచ కప్‌ను దేశానికి అందించిన జట్టుకు తమ కూతురు నాయత్వం వహించడం ఎన్నటికీ మర్చిపోలేం. తమ కూతురి విజయాన్ని మెచ్చుకుంటూ చాలా మంది ఫోన్లు చేసి అభినందిస్తున్నారు. తమ బిడ్డను వారందరూ పొగుడుతుంటే గర్వంగా ఉంది.

చిక్క తిమ్మప్ప, చిత్తమ్మ దీపిక తల్లిదండ్రులు.

లేబర్ కోడ్లతో కార్మికుల హక్కులు హరింపు..!

- తక్షణం వాటిని ఉపసంహరించాలి
- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్ల ద్వారా కార్మికుల హక్కులను హరించడమే అని, తక్షణం వాటిని ఉపసంహరించుకోవాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఏపీ మెడికల్ సేల్స్ రెప్రజెంటేటీవ్‌ల యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈకార్యక్రమంలో ఎపి మెడికల్ సేల్స్ రెప్రజెంటేవ్ యూనియన్ జాతీయ నాయకులు మనోహర్, ఎజి.రాజమోహన్, రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు ప్రాణత్యాగాలు చేసి పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 కోడ్‌లుగా కేంద్ర ప్రభుత్వం తీసుకురావడం దుర్మార్గం అన్నారు. కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాసేందుకు ఈ లేబర్‌కోడ్లు తెచ్చారన్నారు. సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ 1976 కండిషన్ సర్వీస్ యాక్ట్ తీసివేయడం వల్ల సేల్స్ రెప్రజెంటేటీవ్‌ల ఉద్యోగ భద్రత ప్రమాదంలో పడుతోందన్నారు. రెప్రజెంటేటీవ్‌లకు నిర్దిష్టమైన పని విధానం లేదన్నారు. లేబర్ కోడ్‌లు అమలైతే బానిసత్వంతో పని చేయించే ప్రమాదం ఉందన్నారు. కావున లేబర్ కోడ్‌లు రద్దు చేసి, 1976 చట్టం పునరుద్ధరించాలన్నారు. అనంతరం కలెక్టర్ ఓ.ఆనంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఎంఆర్‌యు జిల్లా కార్యదర్శి టి.చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షులు అమర్‌నాథ్, ఉపాధ్యక్షులు మంజు, నరేంద్ర, సహాయక కార్యదర్శి కదిరప్ప, రామాంజినేయులు, కోశాధికారి విజయ్ పాల్గొన్నారు.

గ్రేడ్-1 స్థాయికి రాయదుర్గం మున్సిపాలిటీ

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పురపాలక సంఘాన్ని గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1 స్థాయికి పెంచుతూ మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి తెలిపారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమలులోకి వస్తాయ న్నారు. రాయదుర్గం 1963లో తృతీయ శ్రేణి పురపాలక సంఘంగా ఏర్పడగా 2001లో ద్వితీయ శ్రేణి స్థాయికి పెరిగింది. సుమారు 24 ఏళ్ల తర్వాత గ్రేడ్-1 మున్సిపాలిటీగా స్థాయి పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పురపాలక సంఘం స్థాయిని పెంచాలని పలుమార్లు చేసిన విజ్ఞప్తి మేరకు గ్రేడ్-1 స్థాయికి పెంచినట్లు తెలుస్తోంది. పురపాలక సంఘం స్థాయి పెంచడం పట్ల ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప, పాలకమండలి సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

ఆశావాద దృక్పథంతో పని చేద్దాం

ఐఎఎస్ అధికారుల శిక్షణ సంస్థ డైరెక్టర్ శ్రీరామ్ తరణికంటి

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరామ్ తరణికంటి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

వికసిత్ భారత్ సాధన కోసం జిల్లా అధికారులు నిరంతరం ఆశావాద దక్పథంతో పని చేయాలని ముస్సోరీలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ (ఐఎఎస్ అధికారుల శిక్షణ సంస్థ) డైరెక్టర్ శ్రీరామ్ తరణికంటి సూచించారు. సోమవారం నాడు అనంతపురం కలెక్టరేట్ రెవెన్యూ భవనంలో కలెక్టర్ ఓ.ఆనంద్‌తో కలిసి ఆయా శాఖల జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ తరణికంటి మాట్లాడుతూ సజనాత్మక ఆలోచనలతో ప్రభుత్వ పథకాలను అమలు చేయడంతో పాటు సమాజాభివృద్ధికి, తద్వారా దేశాభివృద్ధికి జిల్లా అధికారులు కషి చేయాలన్నారు. రాష్ట్ర, జాతీయస్థాయి పనితీరును పోల్చుకుని జిల్లా స్థాయిలో మరింత మంచి సేవలను అందించేందుకు కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. జిల్లా అధికారులకు ముస్సోరిలో ట్రైనింగ్ ఇవ్వాలని జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి తిమ్మప్ప కోరారు. జిల్లా అధికారులకు 30 సంవత్సరాల అనుభవం వుంటుందని, వారి అనుభవానికి సజనాత్మక జోడించడానికి ముస్సోరీలో శిక్షణ ఇస్తే బాగుంటుందని డిఆర్‌ఓ ఏ.మలోల కోరారు. ఇందుకుగాను గ్రూప్-ఎ అధికారిగా 10 ఏళ్ల అనుభవం ఉన్న వారికి ముస్సోరిలో శిక్షణ ఇచ్చే సిస్టం మా దగ్గర ఉందని, వారికి శిక్షణ ఇచ్చేలా చూస్తామని డైరెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో కేశవ నాయుడు, ఎస్‌డిసి ఆనంద్, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, సిపిఒ అశోక్ కుమార్‌తో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'పది' పరీక్ష సెంటర్ మార్చొద్దని వినతి

ప్రజాశక్తి-డి.హీరేహాల్

స్థానిక జడ్పీ హైస్కూల్ నుంచి పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని మార్పు చేయవద్దని కోరుతూ సోమ వారం ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ రాజు, వైసిపి నాయకులు రహంతుల్లా, జగదీష్ ఆధ్వర్యంలో ఎంఇఒకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 35 ఏళ్లుగా పదో తరగతి విద్యార్థులు డి.హీరేహాల్ పాఠశాల కేంద్రంలోనే పబ్లిక్ పరీక్షలు రాస్తున్నారన్నారు. కొన్ని కేంద్రాల వల్ల ఈ కేంద్రాన్ని మారుస్తున్నట్లు తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు, నాయకులు, ప్రజలు సోమవారం ఎంఇఒ కార్యాలయం చేరుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని మార్చవద్దని, ఇక్కడే నిర్వహించాలని కోరుతూ హెచ్‌ఎంతో పాటు ఎంఇఒకు వినతి పత్రం ఇచ్చారు. పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని మారిస్తే గ్రామస్తులతో కలిసి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రహంతుల్లా, జగదీష్, మహాబలేశ్వరప్ప, శివారెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని రాణి సత్రం బస్టాండ్ ఆవరణలో ఉన్న అన్నక్యాంటీన్ వద్ద సోమవారం మాస్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంధ సంస్థ హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన స్టాల్ ఏర్పాటు చేసింది. స్వచ్ఛంధ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ నీలకంఠ, ఐసిటిసి విభాగం కృష్ణమూర్తి, అకౌంటెంట్ లోకేష్, తదితరులు హెచ్‌ఐవి, ఎయిడ్స్‌ను నిర్ధారణ చేసే పరీక్షలు, నివారణ పద్ధతులు, మందులు, చికిత్స గురించి తెలిపే కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ 1097, యాక్ట్-2017 గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలోలో మాస్ ఎడ్యుకేషన్ సిబ్బంది, పీర్ ఎడ్యుకేటర్స్, ఆటో డ్రైవర్స్, ఆర్‌టిసి డ్రైవర్స్, తదితరులు పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధర ప్రకటించాలి

వినతిపత్రం ఇస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

రైతులు పండించిన ప్రతి పంటకూ మద్దతు ధర ప్రకటించాలని కోరుతూ సోమవారం వైసిపి ఆధ్వర్యంలో గ్రీవెన్స్‌లో తహశీల్దార్ సుమతికి వినతి ప్రతం ఇచ్చారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం క్వింటా మొక్కజొన్న రూ. 2,400తో రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని, అరటికి మద్దతు ధర ప్రకటించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చంద్రశేఖర్, నాయకులు అభిలాష్, తిమ్మారెడ్డి, గోపాల్‌రెడ్డి, యూసుఫ్, రాము, సర్పంచి నాగభూషణ, ఎంపిటిసి శివన్న, రామన్న, తదితరులు పాల్గొన్నారు.

కట్టడాల క్రమబద్ధీకరణ గడువు పొడిగింపు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. భవన నిర్మాణ అనుమతి పొందకుండా, అనుమతించిన బిల్డింగ్ ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించిన నివాస, వాణిజ్య, పారిశ్రామిక భవనాల క్రమబద్ధీకరణకు 2026 జనవరి 23వ తేదీ వరకూ గడువు పొడిగించినట్లు తెలిపారు. బిల్డింగ్ రెగ్యులరైజేషన్, పీనలైజేషన్, లేఅవుట్ రెగ్యులరైజేషన్ పథకాన్ని సద్వినియోగం చేసుకొని పట్టణ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ సూచించారు.

ఇంటి పట్టాకు దరఖాస్తు చేసుకోండి

పట్టణ పరిధిలో సొంతిల్లు లేని నిరుపేదలు ఇంటి స్థలం కోసం ఈ నెల 30వ తేదీలోగా సంబంధిత వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుతో పాటు కుటుంబంలో భార్య, భర్త ఆధార్ కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లతో పాటు 2 ఫొటోలు పూరించిన దరఖాస్తును సంబంధిత వార్డు సచివాలయంలో అందజేయాలని సూచించారు.

ఎన్‌సిసి రైజింగ్ డే వేడుకలు

రాయదుర్గం రూరల్ : పట్టణంలోని కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నేషనల్ క్యాడెట్ కార్ప్స్ స్థాపనా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్‌సిసిలో పాల్గొనే విద్యార్థులకు ప్రభుత్వ, రక్షణ రంగం, ఉన్నత విద్యా అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. పాల్గొన్న వారిలో రైజింగ్ డే కార్యక్రమం దేశ సేవ పట్ల స్ఫూర్తి నింపిందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబం కోసం పోరాటం

ప్రజాశక్తి-రాయదుర్గం

బాధితుల పక్షాన హైకోర్టులో పిటిషన్ వేసి ఆ కుటుంబానికి న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తానని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు సోమవారం ఓ వీడియో ప్రకటనలో తెలిపారు. రాయదుర్గం పట్టణానికి చెందిన జనసేన పార్టీ నాయకునికి కర్నాటకలోని బాంద్రేవు గ్రామానికి చెందిన రాగుల బాంద్రేవప్ప కుటుంబంతో భూ లావాదేవీలు ఉన్నాయి. ఆ విషయంపై జనసేన పార్టీ నాయకుడు టిడిపి ముఖ్య నాయకుని అండతో రాయదుర్గం, డి.హీరేహాల్ పోలీసు అధికారుల సమక్షంలో పంచాయితీలు చేశారన్నారు. దీంతో మనస్థాపానికి గురైన బాంద్రేవప్ప ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా బళ్లారిలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి ఆ ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయడమే కాక, బాధితుల పక్షాన పోరాడుతానని తెలిపారు.

కార్మికుల జీవితాలతో చెలగాటం తగదు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

రాత్రింబవళ్లు కష్టపడి ప్రజలకు తాగునీరు అందిస్తున్న శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల జీవితాలతో అధికారపార్టీ నాయకులు చెలగాటం ఆడటం దుర్మార్గమని నియోజకవర్గ వైసిపి సమన్వ యకర్త తలారి రంగయ్య మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని రెవెన్యూ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికులు చేపట్టిన రిలే దీక్షలు కొనసాగాయి. 8వ రోజైన సోమవారం కార్మికుల దీక్షకు రంగయ్య సంఘీభావం తెలిపి మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కార్మికులను తొలగించాలని, వేతనాలు తగ్గించాలని బెదిరించడం దుర్మార్గమన్నారు. 32 మంది కార్మికులను తొలగిస్తామని చెప్పడం, పైగా ఖాళీ బాండ్లలో కాంట్రాక్టర్‌కి చెందిన అనుచరులు దౌర్జన్యంగా సంతకాలు చేయించుకోవడం ఏ మాత్రం న్యాయం కాదన్నారు. 8 రోజులుగా కార్మికులు రిలే దీక్ష చేస్తుంటే పాలకులకు పట్టలేదని మండిపడ్డారు. వారి సమస్యలు పరిష్కరించేంత వరకూ కార్మికుల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు. సిఐటియు తాలూకా అధ్యక్షుడు రంగనాథ్ మాట్లాడుతూ దౌర్జన్యం చేస్తున్న కాంట్రాక్టర్, ఆయన అనుచరులపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. దౌర్జన్యంగా సంతకాలు చేయించుకున్న బాండ్లను వెనక్కి ఇవ్వాలన్నారు. దీక్షలో తాగునీటి కార్మిక సంఘం నాయకులు పొన్నూరుస్వామి, ఓబుళపతి, అనిల్, అల్లాబకాష్, లింగమయ్య, మంజునాథ, చంద్రశేఖర్, తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు మద్దతుగా దీక్షల్లో పాల్గొన్న తలారి రంగయ్య

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

రైతుల పండించిన ప్రతి పంటకు ప్రభుత్వం వెంటనే గిట్టుబాటు ధర కల్పించాలని వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త రంగయ్య ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీవో వసంతబాబుకు విన్నవించారు. ప్రధానంగా మొక్కజొన్న, కంది, అరటి పంటలకు ధర లేక రైతులు నష్టపోతున్నారన్నారు. కనీసం పెట్టుబడులు కూడా రావడంలేదన్నారు. కావున ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఆయా పంటలను గిట్టుబాటు ధరతో కొనుగోలు చేసి, రైతులకు వెంటనే నగదు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గోళ్ల సూరి, సుధీర్, కృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పంట పెట్టుబడి వ్యయం తగ్గించడమే లక్ష్యం

రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ఎడిఎ పద్మజ

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

వ్యవసాయంలో పెట్టుబడి వ్యయాన్ని తగ్గిస్తూ అధిక దిగుబడులతో ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం మార్గదర్శకాలు చేసిందని రాయదుర్గం సహాయ వ్యవసాయ సంచాలకులు పద్మజ పేర్కొన్నారు. మండలంలోని ఆవులదట్ల, వద్రహొన్నూరు గ్రామాల్లో సోమవారం వ్యవసాయ, అనుబంధ శాఖలు నిర్వహిస్తున్న 'రైతన్నా మీకోసం' కార్యక్రమం నిర్వహించారు. ఎడిఎ మాట్లాడుతూ అధికారులు ప్రణాళికలు రూపొందించుకొని రైతులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. అన్నదాత సుఖీభవ రెండో విడత సొమ్ము రైతుల ఖాతాల్లో జమ అయిందన్నారు. రైతులు మార్కెట్ ఆధారిత పంటలు సాగు చేయాలని, ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధి కారి అహ్మద్‌బాషా, పశు వైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో అన్నదానం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి సందర్భంగా సోమవారం పట్టణంలోని ప్రభుత్వా సుపత్రిలో వందమంది దివ్యాంగులు, రోగులకు శ్రీసత్యసాయి ధ్యానమండలి మహిళా విభాగం ఆధ్వ ర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాలలో ప్రతిరోజూ సాయంకాలం నిత్య యోగా, ధ్యానం సాధన చేస్తున్న మహిళా యోగా సాధకులు ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దుర్గం ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ కంబాల తిమ్మారెడ్డి, కార్యదర్శి పాటిల్ ఉదయ్ కుమార్ రెడ్డి, సుజాత, ఎస్.రాజ్యలక్ష్మి, మంజుభార్గవి, శైలజ, శిల్ప, కంబాల సులోచన, పలవరి సత్యనారాయణ, మేడా ప్రభాకర్, షిరిడీనాథ్, ఆసుపత్రి సిబ్బంది, రఘువీరా ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న సత్యసాయి ధ్యానమండలి సభ్యులు

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి

మహిళా సంఘాల సభ్యులకు చెక్కులు అందజేస్తున్న ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. సోమవారం నగరంలోని అంబేద్కర్ భవన్‌లో నగరంలోని 846 సంఘాలకు మంజూరైన రూ.126.46 కోట్ల మెగా చెక్కులను మహిళా సంఘాల సభ్యులకు అందజేశారు. అలాగే 25 మంది స్వయం సహాయక సభ్యులకు 25 రాపిడో ఈ-బైకులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో తమ కాళ్ల మీద నిలబడాలని ప్రభుత్వం ఎన్నో సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. ముఖ్యంగా ర్యాపిడో ఈ-బైక్‌ల ద్వారా స్వయం ఉపాధి పొందుతారన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలన్న ఉద్దేశంతో జిల్లాలోని మహిళా సంఘాలకు ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సహించి ఆర్థికసాయం అందజేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలస్వామి, మెప్మా పీడీ విశ్వజ్యోతి, కార్పొరేటర్ బాలాంజనేయులు, మున్సిపల్ అధికారులు, టిడిపి నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులందరికీ బ్యాంకు రుణాలివ్వాలి

ఎపి కౌలు రైతుసంఘం నాయకులు సురేష్, వెంకటేశులు

వినతిపత్రం అందజేస్తున్న ఎపి కౌలు రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

కౌలు రైతులు అందరికీ బ్యాంకు రుణాలు ఇవ్వడంతోపాటు ఈ-క్రాప్ నమోదు చేసి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని ఎపి కౌలు రైతుసంఘం ఉరవకొండ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, వెంకటేశులు కోరారు. ఈమేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎపి కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ మహబూబ్‌బాషా, మండల వ్యవసాయ అధికారి రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్య వహించడం మంచిది కాదన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో దాదాపుగా 20వేల మందికిపైగా కౌలు రైతులు ఉండగా కేవలం వెయ్యిమందికి మించి సిసిఆర్‌సి కార్డులు ఇవ్వలేదన్నారు. కావున ఉన్నతాధికారులు స్పందించి కౌలు రైతులందరికీ సిసిఆర్‌సి కార్డులు మంజూరు చేసి పథకాలు వర్తించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుసంఘం మండల నాయకులు సుంకన్న, ధనంజయ, మోపిడి ప్రసాద్, లాలెప్ప, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రైతులను విస్మరించిన కూటమి ప్రభుత్వం

ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు..- మాజీ మంత్రి సాకే శైలజనాథ్

విలేకరులతో మాట్లాడుతున్న శైలజనాథ్

ప్రజాశక్తి-అనంతపురం

ఏ పంటకూ గిట్టుబాటు ధరలేక అల్లాడుతున్న రైతులను చంద్రబాబు సారథ్యంలోని కూటమి సర్కార్ పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి సాకే శైలజనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పత్తి, అరటి, మొక్కజొన్న, మినుములు, శనగలు, మొక్కజొన్న, మిర్చితోపాటు ఏ పంటకూ గిట్టుబాటు ధరలేక రైతులు రోడ్డెక్కే దుస్థితి దాపురించిందన్నారు. దీనికితోడు పెట్టుబడి సాయం, ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వకపోవడంతో సాగు భారమై అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. అంతేగాకుండా ఉచిత పంటల బీమాకు మంగళం పాడారన్నారు. అదే జగన్ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనం నుంచి విక్రయం, మద్దతు ధర కోల్పోయిన ప్రతిపంటనూ ప్రభుత్వమే కొనుగోలు చేసిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని, లేనిపక్షంలో రైతులకు అండగా ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు.

యువత నైతిక విలువలను పెంచుకోవాలి

ఎస్‌వి కళాశాల వైస్‌చైర్మన్ సి.చక్రధరరెడ్డి

మాట్లాడుతున్న ఎస్‌వి కళాశాల వైస్‌చైర్మన్ సి.చక్రధరరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

యువత నైతిక విలువలను పెంచుకోవాలని ఎస్‌వి డిగ్రీ, పీజీ కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధరరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎస్వీ కళాశాలలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు నైతిక విద్య, విలువలు, సామాజిక స్పృహ, చైతన్యం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావిభారత పౌరులైన యువత ప్రస్తుత సమాజంలో తమదైనందిన జీవితాన్ని సక్రమ మార్గంలో గడిపేందుకు బాటలు వేసుకోవాలన్నారు. నైతిక విలువలను ఆచరించడం ద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. సంస్థ చైర్మన్ శీలా జయరామప్ప మానవత స్వచ్ఛంద సేవా ఆవిర్భావం, ఆశయాల గురించి సవివరంగా వివరించారు. ప్రధాన వక్త రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ డి.గోవిందరాజులు మనిషి తన జ్ఞానేంద్రియాలు, మెదడు, హృదయాన్ని ఉపయోగించు కోవడం వల్ల కలిగే ఫలితాను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎఓ శ్రీనాథ్, తెలుగు లెక్చరర్ మురళీ, సంస్థ కార్యదర్శి ప్రకాష్, సభ్యులు దివాకర్, ఆదిలక్ష్మి, నాగరాజేశ్వరి, శ్రీరాములు, రాజు, ఎన్ఎస్ఎస్ పిఒ జి.ఆనంద్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం

కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం

ఒటిపిఆర్ఐ ఎన్ఎస్ఎస్ భాగం ఆధ్వర్యంలో బుక్కరాయసముద్రం మండలం రేకులకుంట గ్రామంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక క్యాంపు సోమవారం ముగిసింది. జెఎన్‌టియు అనుబంధ తైల సాంకేతిక సంస్థ సంచాలకులు జివి సుబ్బారెడ్డి నేతృత్వంలో ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకూ ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఒటిపిఆర్ఐ సంస్థ సంచాలకులు జీవి సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ సి.గోపీనాథ్, డిప్యూటీ రిజిస్ట్రార్ బి.దుర్గాప్రసాద్, రేకులకుంట సర్పంచు కె.నరసమ్మ, మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల చైర్మన్ అరుణ్‌కుమార్, మై భారత ప్రోగ్రాం ఆఫీసర్ గోవర్ధన, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE,ANANTAPURAMU
O.S.NO.130/2014

Between:
Mandli Nagaraju ...**Plaintiff**

AND

1. T.V.Konda Reddy (died by LRs)
2. T.Bala Saraswathi
3. T.Ramchandra Reddy ...**Defendants**

NOTICE TO THE DEFENDANTS NO: 2 AND 3

D2: T.Bala Saraswathi, W/o Late T.V.Konda ReddyD.No.1-1455, ADCC Bank Colony, Rudrampeta, Anantapuramu.

D3: T.Ramchandra Reddy, S/o Late T.V.Konda ReddyD.No.1-1455, ADCC Bank Colony, Rudrampeta, Anantapuramu.Madam/Sir,

Madam/Sir,

Whereas the Plaintiff filed the above suit for specific performance, you are hereby directed to appear in person or by pleader duly instructed before the Hon'ble Court on 05.12.2025 at 10-30 a.m., to show cause against the case, failing which the said matter will be heard and determined by ex parte.

(By Order of the Court)
SRI.N.JAYARAM,
Advocate for the Plaintiff

ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇని సస్పెండ్ చేయాలి

కలెక్టర్‌కు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు వినతి

కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న జి.ఓబులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకం టెండర్‌ను అర్హత లేని కాంట్రాక్టర్‌కు ఆమోదించిన ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఆర్.సురేష్‌ను సస్పెండ్ చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో శ్రీరామిరెడ్డి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై కలెక్టరేట్ రెవెన్యూభవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఓ.ఆనంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జి.ఓబులు మాట్లాడుతూ నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకం ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గం, రాయదుర్గం, మడకశిర, హిందూపురం నియోజకవర్గాలకు తాగునీటి అందిచేందుకు 600 మంది కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి 4 ప్రాంతాలకు సంబంధించిన తాగునీటి సరఫరా టెండర్‌ను ప్రకాశం జిల్లాకు చెందిన అడపాల వెంకటరావుకు కాంట్రాక్టర్‌గా ఆమోదించారని తెలిపారు. ఈ టెండరుకు కావాల్సిన అనుభవం, అర్హతలు ఉండాల్సిన సాల్వెన్స్, ఇన్‌కమ్‌ట్యాక్స్ సరిఫికేట్, బిడ్ కెపాసిటి లేకపోయినప్పటికీ కాంట్రాకర్‌గా వెంకటరావును ఆమోదించాన్నారు. అనుభవం లేని కాంట్రాక్టర్ ఉండటం వల్ల ఉమ్మడి జిల్లా ప్రయోజనాలకు తీవ్రమైన నష్టం జరుగుతోందన్నారు. ఇంత పెద్ద తాగునీటి ప్రాజెక్ట్ చేసే కాంట్రాక్టర్‌కు అనుభవం ఉండాలన్నారు. ముఖ్యంగా ఇటు ప్రజలకు తాగునీరు అందించడంలో విఫలం చెందిన కాంట్రాక్టర్, అటు ఏళ్ల తరబడి పని చేస్తున్న కార్మికులను అక్రమ వేధింపులు, తొలగింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. ఖాళీ 100 బాండ్‌లపై సంతకాలు చేయాలంటే ఆదేశిస్తున్నారని తెలిపారు. కొత్త టెండరు వేసుకుంటే కాంట్రాక్టర్ కార్మికులతో వచ్చి కలుస్తారన్నారు. కార్మికులకు వేతనాలు పెంచాల్సింది పోయి ఖాళీ బాండ్లపై సంతకాలు చేయిస్తుండటం దుర్మార్గంగా ఉందన్నారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ సురేష్‌ను పిలిపించి సదరు కాంట్రాక్ట్ నియమ నిబంధనలు, అర్హతలు కార్మిక సంఘాలు, కార్మికులకు తెలియజేయాలని ఆదేశించారు. అనంతరం కాంట్రాక్టర్ అర్హుడు కాదని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గిరిజమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మన్నీల రామాంజినేయులు పాల్గొన్నారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్

వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

తుఫాన్ వల్ల వర్షానికి నష్టపోయిన వేరుశనగ, పత్తి, కంది పంటలు సాగు చేసిన రైతులకు ఎకరాకు రూ.50వేల నష్టపరిహారం అందించి ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారం వేదికలో తహశీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రాచేపల్లి గ్రామం వద్ద ఉన్న చెప్పుల పరిశ్రమను రీఓపెన్ చేసి నిరుద్యోగులకు ఉద్యోగం కల్పించాలన్నారు. అలాగే అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ డబ్బులు పడని రైతులకు వెంటనే వారి ఖాతాలకు జమ చేయాలన్నారు. అలాగే పంట నష్టపోయిన రైతులకు పరిహారంతోపాటు రబీ సీజన్‌లో సాగు చేసేందుకు అలసంద, ఉలవ, పెసర, కొర్ర, జొన్న విత్తనాలను వందశాతం సబ్సిడీతో ఇవ్వాలన్నారు. సలకంచెరువు చెరువుకు హెచ్చెల్సీ నీరు ఇవ్వాలని కోరారు. వీటితోపాటు అనేక సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు శ్రీనివాసులు, లక్ష్మీపతి, సూర్యప్రకాష్, ఎర్రిస్వామి, సుంకన్న, రామాంజనేయులు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు మొబైల్ ఫోన్లు ఇవ్వాలి : సిఐటియు

వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

తాడిపత్రి ప్రాజెక్టు పరిధిలో పని చేస్తున్న అంగన్వాడీ వర్కర్లకు కొత్త మొబైల్ ఫోన్లు ఇవ్వాలని సిఐటియు నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తహశీల్దార్ సోమశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాడిపత్రి ప్రాజెక్టు పరిధిలో పని చేస్తున్న అంగన్వాడీ వర్కర్లకు తగిన యాప్‌లపై శిక్షణ, సాంకేతిక సమస్యలను పరిష్కరించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే నాణ్యమైన సెల్‌ఫోన్లను ప్రభుత్వమే ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు మహాలక్ష్మి, శంకరమ్మ కోశాధికారి భాగ్యలక్ష్మి సెక్టార్ లీడర్లు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బూటకపు ఎన్‌కౌంటర్లపై విచారించాలి

ప్రజాశక్తి-గుత్తి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న బూటకపు ఎన్‌కౌటర్లపై సుప్రీంకోర్టు న్యా యమూర్తితో విచారణ చేపట్టాలని అఖిల భారత రైతు కూలీ సంఘం కార్యదర్శి టి.రామాంజినేయులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట అఖిల భారత వ్యవసాయ కూలీసంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై దాడులు అధికమయ్యాయన్నారు. అడవులలో ఉన్న సంపదను కార్పొరేట్లకు అప్పగించేందుకు ప్రభుత్వాలు మారణకాండను సృష్టిస్తున్నాయన్నారు. ప్రభుత్వం తక్షణమే మావోయిస్టులతో చర్చలు జరిపి బూటకపు ఎన్‌కౌంటర్లు, ఆదివాసీలపై దాడులు ఆపాలని తహశీల్దార్ పుణ్యవతికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాళ్లు రాజమ్మ, ఆదిలక్ష్మి, సులోచన, రమీజా, షాహిదా, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ సంపదపై అవగాహన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గుత్తి : ప్రపంచ వారసత్వ వారోత్సవాల్లో భాగంగా సోమవారం గుత్తి కోట సంరక్షణ సమితి ఆధ్వర్యంలో విద్యార్థులు, పర్యాటకులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షులు సి.విజయభాస్కర్, హెచ్ఎం సుంకన్న అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వరి, గుత్తి కోట సంరక్షణ సమితి నాయకులు బాబాసాహెబ్, శివ, తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం

చెక్కు అందజేస్తున్న నాగబాబు

బుక్కరాయసముద్రం : మండలంలోని దయ్యాలకుంటపల్లి గ్రామానికి చెందిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుడు చాకలి శివానంద కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జనసేన నాయకులు మాట్లాడుతూ చాకలి శివానంద కొంతకాలం కిందట జరిగిన ప్రమాదంలో మరణించాడు. అయితే శివానందకు జనసేన క్రియాశీలక సభ్యత్వం ఉండటంతో కుటుంబ సభ్యులను మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో రూ.5లక్షల చెక్కును ఆ పార్టీ రాష్ట్ర నాయకులు, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ అనంతపురం నగర అధ్యక్షులు పొదిలి బాబూరావు, శింగనమల నియోజకవర్గ ఇన్‌ఛార్జి సాకే మురళీకృష్ణ, బుక్కరాయసముద్రం మండల అధ్యక్షులు గండ్రగొడ్డలి ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

7,300 క్వింటాళ్ల వేరుశనగ కేటాయింపు

అనంతపురం : రబీ సీజన్‌కు సంబంధించి రైతులకు రాయితీపై పంపిణీ చేసేందుకు 7,300 క్వింటాళ్ల వేరుశనగను జిల్లాకు కేటాయించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి యు.ఉమామహేశ్వరమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు కేటాయించిన వాటిలో కె-6 రకం 6వేల క్వింటాళ్లు, టిసిజిఎస్ -1694 రకం 1300 క్వింటాళ్లు కేటాయించినట్లు తెలిపారు.

తిమ్మంపల్లిలో మూడు పాడి ఆవులు మృతి

ప్రజాశక్తి-యల్లనూరు

మండల పరిధిలోని తిమ్మంపల్లి గ్రామంలో సుజాత అనే పాడి రైతుకు చెందిన మూడు ఆవులు మరణించాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. సుజాత గత కొన్ని నెలలుగా మూడు పాడి ఆవులను పోషిస్తూ జీవనం సాగించేది. ప్రతి రోజులాగానే సోమవారం సాయంత్రం 3గంటలకు ఆవుల నుంచి పాలు పిండుకుని వాటిని పక్క గ్రామంలో ప్రజలకు ఇచ్చేందుకు వెళ్లింది. ఆమె రాత్రికి ఇంటికి వచ్చే చూసేసరికి మూడు ఆవులూ కడుపు ఉబ్బి మరణించాయి. ఉన్న ఫలంగా ఆవులు మరణించడంతో దానిపై ఎవరైనా విష ప్రయోగం చేసి ఉంటారా అన్న అనుమానం వ్యక్తం అవుతుంది. కాగా సాయంత్రం ఆవుపాలను తీసుకుని వాటిని తాగిన వారు విషయం తెలుసుకుని తమకు ఏమైనా జరుగుతుందేమోనని ముందస్తుగా అనంతపురం జిల్లా ఆసుపత్రికి వెళ్లారు.

స్థలం ఇప్పించాలని వినతి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

తన స్థలాన్ని తనకు ఇప్పించాలని వజ్రకరూరు మండలానికి చెందిన మంజుల సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విన్నవించుకుంది. తన గ్రామంలోని రాజీవ్ కాలనీలో సర్వే నెం.279-ఎ2, ప్లాట్ నెం.219లో తన రెండు సెంట్ల స్థలాన్ని అదే గ్రామానికి చెందిన మన్సూర్, ఉస్మాన్ తన భర్తను మభ్యపెట్టి వారికి రాయించుకున్నారన్నారు. కావున తన స్థలాన్ని తనకు ఇప్పించాలని కోరారు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణను ఉపసంహరించుకోవాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-బెలుగుప్ప

వైద్య కళాశాల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని వైసిపి సీనియర్ నాయకులు త్రిలోక్‌నాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని కాలువపల్లి గ్రామంలో కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ విద్య వైద్యంతో పాటు ప్రభుత్వ మెడికల్ కళాశాలను తీసుకొచ్చి పేద విద్యార్థులకు వైద్య విద్యను అందజేశారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటీకరించేందుకు పూనుకోవడంతో పేద విద్యార్థులకు వైద్య విద్య దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. కావున ప్రభుత్వం వెంటనే స్పందించి వైద్య కళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని మార్చుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెద్దన్న మాజీ ఎంపిటీసీ వెంకటేశులు మాజీ స్కూల్ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి మాజీ సర్పంచులు మండల వైఎస్సార్సీపీ నాయకులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

ఓటర్లను మ్యాపింగ్ చేయాలి

రాప్తాడు నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎం.రామ్మోహన్

ప్రజాశక్తి-రాప్తాడు

నియోజకవర్గంలోని బూత్ లెవల్‌లో ఓటర్లు అందరినీ మ్యాపింగ్ చేయాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎం.రామ్మోహన్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని తహశీల్దార్లు, బూత్ లెవెల్ సిబ్బంది, అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ లెవెల్ ఓటర్ల మ్యాపింగ్‌లో చాలా వెనుకబడ్డామన్నారు. త్వరితగతిన డీఎల్వోలు పని చేసేలా చూడాలని తహశీల్దార్లను ఆదేశించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 18 పోలింగ్ బూత్‌లు కొత్తగా ఏర్పాటు కానున్నట్లు తెలిపారు. ఇందులో ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే చెప్పవచ్చున్నారు. అదేవిధంగా నూతనంగా ఓటరుగా నమోదు చేసుకున్న వారిని గుర్తించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాప్తాడు, ఆత్మకూరు, రామగిరి మండలాల తహశీల్దార్లు విజయకుమారి, లక్ష్మానాయక్, రవి, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ సువర్ణ, సిపిఐ బెల్లం మహాదేవ్, బిజెపి చెన్నకేశవులు, టిడిపి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలి

అంగన్‌వాడీ యూనియన్ నాయకుల వినతి

వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో అర్హులైన అంగన్‌వాడీ హెల్పర్‌లకు టీచర్లుగా ఉద్యోగోన్నతి కల్పించాలని అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రమాదేవి, జిల్లా కోశాధికారి కాత్యాయని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై గత ప్రభుత్వం చేసిన సమ్మె సందర్భంగా ప్రభుత్వం జారీ చేసిన సమ్మె కాలపు మినిట్ కాపీ అమలులో జాప్యాన్ని నిరసిస్తూ అమలు చేయాలని కోరుతూ డిసెంబర్ 12న సెంటర్లను మూసివేసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈమేరకు కలెక్టర్‌కు ధర్నా విషయాన్ని తెలియజేస్తూ పత్రాన్ని అందజేశారు. అనంతరం పీడీని కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు.

రాష్ట్రస్థాయి చెకుముకి సంబరాలకు ఎంపిక

అనంతపురం కలెక్టరేట్ : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగే రాష్ట్రస్థాయి చెకుముకి సంబరాలకు జిల్లా నుంచి రెండు జట్లు ఎంపికైనట్లు జెవివి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెపి.చిత్తప్ప, కె.వీరరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో మొదటి స్థానంలో వచ్చిన వారిని మాత్రమే రాష్ట్ర కమిటీకి ఎంపిక చేసినట్లు తెలిపిఆరు. వీరంతా డిసెంబర్ 21, 22, 23వతేదీల్లో కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి చెకుముకి సంబరాల్లో పాల్గొంటారని తెలిపారు.

జాతీయ తైక్వాండో పోటీల్లో 'గుజ్జల' ప్రతిభ

ప్రతిభ కనబరిచిన రాహుల్‌కృష్ణ

అనంతపురం కలెక్టరేట్ : ఉత్తర్‌ప్రదేశ్‌లోని బెరలిలో 21, 22, 23 తేదిల్లో నిర్వహించిన జాతీయ స్థాయి తైక్వాండో క్రీడా పోటీల్లో అనంతపురం నగరానికి చెందిన గుజ్జల రాహుల్ కృష్ణ బంగారు పతకాన్ని సాధించాడు. రాహుల్ కృష్ణ అనంతపురం నగరంలోని లక్ష్మీ సినర్జీ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. కోచ్ రామాంజినేయులు శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచాడని విద్యార్థి తండ్రి శంకర్ ఆనందం వ్యక్తం చేశారు. లక్ష్మీ సినర్జీ స్కూల్ ఛైర్మన్ మధుసూదన్ రెడ్డి మెడల్ సాధించిన రాహుల్ కృష్ణను అభినందించారు.

పాఠశాలలో కొళాయి ధ్వంసం

నార్పల : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో గతరాత్రి కొంతమంది ఆకతాయిలు కొళాయిలు, సింక్‌ను ధ్వంసం చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికుమార్, ఎస్ఎంసి ఛైర్మన్ ప్రసాద్, తదితరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కళాశాలకు ప్రహరీ లేకపోవడంతోనే రాత్రి సమయంలో ఆకతాయిలు ఇలా చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

'డయల్ యువర్ ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి'కు 65 వినతులు

అనంతపురం : విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం సోమవారం డయల్ యువర్ ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమానికి 65 వినతులు అందినట్లు సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. సోమవారం తిరుపతిలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అనంతపురం నుంచి 7, శ్రీసత్యసాయి సర్కిల్ నుంచి 2 వినతులు వచ్చినట్లు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

బెలుగుప్ప : మంత్రి పయ్యావుల కేశవ్ బ్రదర్స్ ఆదేశాల మేరకు సోమవారం మండల పరిధిలోని ఆవులెన్న గ్రామంలో మ్యాగ్నస్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా దాదాపు వందమందికి పైగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సుగుణ, రితీష్, లిఖిత, సర్పంచు రామ్మోహన్, నారాయణస్వామి చౌదరి, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మహిళ అనుమానాస్పద మృతి

ఆత్మహత్య చేసుకున్న రత్నమ్మ

తాడిపత్రి రూరల్ : అనుమానాస్పద స్థితిలో ఉరేసుకుని మహిళ మృతిచెందిన ఘటన సోమవారం మండల పరిధిలోని పులిపొద్దుటూరు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పులిపొద్దుటూరు గ్రామానికి చెందిన వెంకీరెడ్డి భార్య రత్నమ్మ (50) సోమవారం ఉదయం ఇంట్లో ఉన్న ఫ్యానుకు వేలాడుతూ అనుమానాస్పదంగా మృతిచెందింది. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. రత్నమ్మ మృతిపై దిమ్మగుడి గ్రామానికి చెందిన ఆమె తమ్ముడు మోహన్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామన్నారు. కాగా మృతురాలి కి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

హంద్రీనీవా కాలువలో వ్యక్తి గల్లంతు

ఆత్మకూరు : మండలంలోని పడమటి కొత్తపల్లి గ్రామంలో నివాసం ఉంటున్న వీరాంజనేయులు (40) సోమవారం చేపలు పట్టేందుకు హంద్రీనీవా కాలువలోకి వెళ్లి గల్లంతయినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు..కళ్యాణదుర్గం మండలం పిటిఆర్.పల్లికి చెందిన వీరాంజనేయులు మండలంలోని పడమటి కొత్తపల్లి గ్రామంలో వివాహం చేసుకుని ఇక్కడ నివాసం ఉంటున్నాడు. ఈనేపథ్యంలో పంపనూరు వద్ద ఉన్న హంద్రీనీవా కాలువలో మరో వ్యక్తితో కలిసి చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. దీంతో తోడుగా వెళ్లిన వ్యక్తి గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు గజ ఈతగాళ్లతో కాలువ వద్దకు చేరుకని గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది.

పాముకాటుతో యువకునికి అస్వస్థత

గుత్తి : కర్నూలు జిల్లా తుగ్గిలి మండలం బొల్లవానిపల్లి గ్రామంలో పాముకాటు వేయడంతో యవకుడు అస్వస్థత గురయ్యాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన యశ్వంత్ కుమార్ ఆదివారం రాత్రి ఇంటి సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా పాముపై కాలు పెట్టాడు. దీంతో పాము కాటు వేసింది. వెంటనే విషయాన్ని కుటుంబ సభ్యులకు విషయం చెప్పడంతో వెంటనే అతడిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రి తరలించారు.

చీరలు చోరీ

గుత్తి : పట్టణంలోని స్పందన శారీ సెంటర్‌లో ముగ్గురు మహిళా దొంగలు చీరలు దొంగిలించారు. సోమవారం చీరలను కొనుగోలు చేస్తున్నట్టు నటించి ఎత్తుకెళ్తుండగా ఒకరిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మహిళా దొంగను దేహశుద్ధి చేసి పోలీసులు అప్పగించారు. మరో ఇద్దరు మహిళలు పరారయ్యారు. దొంగతనం దృశ్యాలు సిసి కెమెరాల్లో రికార్డు అయ్యాయి. పోలీసులు సీసీ కెమెరాల్లోని దృశ్యాల ఆధారంగా దర్యాప్తును ప్రారంభించారు.

బూటకపు ఎన్‌కౌంటర్లపై విచారణకు డిమాండ్

ప్రజాశక్తి-గుంతకల్లు

మారేడుపల్లి అటవీ ప్రాంతంలో పోలీసులు చేసిన బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం పట్టణంలోని పొట్టి శ్రీరాములు సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ సర్కారు ఆదివాసీలు నివసిస్తున్న అటవీ ప్రాంతాల్లోని సహజ ఖనిజ వనరులను కార్పొరేట్ సంస్థలకు కట్టపెట్టేందుకు ఆపరేషన్ కగారు పేరుతో మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్లు చేయిస్తోందన్నారు. వెంటనే ప్రధాని మోదీ ప్రభుత్వం స్పందించి ఆపరేషన్ కగార్‌ను రద్దు పరిచి శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు అడ్వకేట్ సురేష్, ఎపిసిఎల్‌సి జిల్లా కార్యదర్శి ఆదినారాయణ, ఒపిడిఆర్ జిల్లా ఉపాధ్యక్షులు అడ్వకేట్ నాగరాజు, సంచార జాతుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, ముస్లిం మత పెద్ద మాలిక్, ఐఎఫ్‌టియు పట్టణ కార్యదర్శి రామ్‌దాస్, ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్‌నాయక్, ఐఎఫ్‌టియు పట్టణ అధ్యక్షులు రామాంజనేయులు, కమిటీ సభ్యులు జిలాన్, సత్తార్, షేక్షావలి, రఘు, బాషా, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు మౌనగిరి పీఠం 8వ వార్షికోత్సవం

ప్రజాశక్తి-రాప్తాడు

మండల పరిధిలోని హంపాపురం గ్రామం వద్ద ఉన్న మౌనగిరి ఆంజనేయస్వామి ఆలయ 8వ వార్షికోత్సవ సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు ఈశ్వరయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం ప్రత్యేక పూజలు మరియు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి వేలాదిగా తరలివస్తున్న భక్తులకు త్రాగునీటి సౌకర్యం కూడా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు మండల పరిధిలోని భక్తులే కాకుండా ఇతర ప్రాంతాల్ని కూడా భువనగిరి అభయాం ఇతర ప్రాంతాల్ని కూడా మౌవనగిరి అంజనేయస్వామిజనేయస్వామి దర్శించుకుంటారని ఆయన తెలిపారు.

అరటి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి-పుట్లూరు

అరటి పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం మండల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయం సమీపంలో ఉన్న వీరబ్రహ్మేంద్ర ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎపి రైతుసంఘం మండల అద్యక్షులు ఎన్.గోపాలకృష్ణ మాట్లాడుతూ మండల వ్యప్తంగా వందల ఎకరాల్లో రైతులు ఉద్యాన పంటలు సాగు చేశారన్నారు. వీటితో ముఖ్యంగా అరటి ఎక్కువగా సాగు చేశారన్నారు. అయితే లక్షలు పెట్టి పంట సాగు చేస్తే ధరలు పడిపోవడంతో కనీసం కూలీల ఖర్చు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. అరటి పంట టన్ను రూ.22వేల నుచి రూ.2 వేలకు పడిపోయిందన్నారు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. కావున ప్రభుత్వం స్పందించి అరటి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం నాయకులు టి.వీరయ్య, పి.పూలరంగడు, పెద్ద బాలనరసింహుండు, రైతులు మారుతి, అంకిరెడ్డి, గురుస్వామి, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

కోతులు పట్టివేత

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలో ఉన్నకోతులను (వానరాలు) స్థానికులు చందాలు వేసుకుని అడవులకు తరలించారు. ఇటీవల కొతులు అధికమై ఇళ్లలోకి చొరబడి వస్తువులను ఎత్తుకుపోవడంతో పాటు చిన్నారులపై కూడా దాడులు చేస్తున్నాయి. దీంతో సత్యసాయి కాలనీకి చెందిన పలువురు సొంతంగా చందాలు వసూలు చేసుకుని కోతులు పట్టే వారిని పిలిపించి కోతులను బంధించి సమీప ప్రాంతంలోని అడవులకు తరలిస్తున్నారు

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

'రైతన్నా-మీకోసం'లో నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలోకి కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటోందని ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. సోమవారం అనంతపురం అర్బన్‌లోని ఎ.నారాయణపురం రైతు సేవాకేంద్రం పరిధిలో ఏర్పాటు చేసిన 'రైతన్నా-మీకోసం' కార్యక్రమాన్ని ఎంపి, ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రైతుకూ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఇప్పటికే రైతులకు రాయితీతో డ్రిప్, స్ప్రిక్లర్లను అందించామన్నారు. అలాగే రెండు విడతల్లో పెట్టుబడి సాయం కింద అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ నిధులు విడుదల చేశామన్నారు. అలాగే అనంతపురం రూరల్ మండలం ఆలమూరు పంచాయతీలో మండల వ్యవసాయ అధికారి వెంకటకుమార్ ఇంటింటికీ వెళ్లి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎంస్ ఛైర్మన్ నెట్టం వెంకటేష్, సర్పంచు ఆలమూరు సూరి, రైతు సేవాకేంద్రం సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్ : రైతుల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించేందుకే ప్రభుత్వం రైతన్న-మీకోసం కార్యక్రమం నిర్వహిస్తోందని తాడిపత్రి వ్యవసాయ సహాయ సంచాలకులు రవి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎర్రగుంటపల్లిలో రైతన్న-మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పంటల పెరుగుదల, వ్యాధులు, పురుగుల సమస్యలను అడిగి తెలుసుకుని తగిన సూచనలు ఇచ్చారు. అదేవిధంగా రైతులకు అందుతున్న వ్యవసాయ సేవలను పరిశీలిస్తూ పంటల స్థితి, ఎరువుల సరఫరా, కనిష్ట మద్దతు ధర, రైతు బీమా వంటి అంశాలపై వివరాలు సేకరించి.. అవసరమైన సాంకేతిక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల సమస్యలను సంబంధిత శాఖలకు చేరవేసి తక్షణ పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎం.ఆంజనేయులు, గ్రామస్థాయి వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన 'రైతన్న-మీకోసం' కార్యక్రమాన్ని సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.రవి పరిశీలించారు. ఇందులో భాగంగా పంటల పెరుగుదల, వ్యాధులు, పురుగుల సమస్యలు, రైతులకు అందుతున్న వ్యవసాయ సేవలను పరిశీలిస్తూ రైతులతో నేరుగా మాట్లాడారు. తర్వాత పంటల స్థితి, ఎరువుల సరఫరా, కనిష్ట మద్దతు ధర, రైతు బీమా వంటి అంశాలపై వివరాలు సేకరించి, అవసరమైన సాంకేతిక సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా రైతుల నుంచి వచ్చిన సూచనలు, సమస్యలను సంబంధిత శాఖలకు చేరవేసి తక్షణ పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామనిహామీ ఇచ్చారు. రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పిస్తూ, సకాలంలో పంట సంరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సి.చన్నవీరస్వామి, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

శింగనమల : ప్రభుత్వం చేపట్టిన రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి అన్వేష్‌కుమార్ తెలిపారు. సోమవారం నుంచి ఈనెల 29వతేదీ వరకూ మండల వ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రైతు సేవాకేంద్రంతో పాటు సచివాలయంలో పని చేసే ఉద్యోగులు రోజూ 90 కుటుంబాలను కలిసి పంచసూత్రాలను వివరిస్తామన్నారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న ఎంపి, ఎమ్మెల్యే

పామిడి : మండలంలోని అన్ని రైతు సేవాకేంద్రాల్లో రైతన్నా-మీకోసం కార్య క్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు సేవా కేంద్రం, సచివాలయ సిబ్బంది సమన్వయంతో రోజూ 90 వ్యవసాయ కుటుంబాలను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకోనున్నట్లు తెలిపారు. కావున రైతుల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యల్లనూరు : మండల వ్యాప్తంగా రైతు సేవాకేంద్రాల పరిధిలో 'రైతన్నా-మీ కోసం' కార్యక్రమాన్ని సోమవారం నుంచి ప్రారంభించినట్లు వ్యవసాయ అధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 29వ తేదీ వరకూ ప్రతి ఇంటికీ వెళ్లి పంచసూత్రాలైన నీటి సంరక్షణ, సేంద్రీయ వ్యవసాయం, అగ్రిటెక్, డిమాండ్ ఆధారిత పంటలు, ఫుడ్ ప్రాసెసింగ్‌కు ప్రభుత్వ ప్రోత్సాహంపై రైతులకు వివరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ మధుకుమార్, విహెచ్ఎ మురళి, రైతులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండలంలోని కొట్టాలపల్లి గ్రామంలో సోమవారం 'రైతన్నా-మీకోసం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి సుందర్‌రెడ్డి, ఉద్యానశాఖ అధికారిణి శైలజ కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ సర్జన్ గోవిందరాజులు, పశు శాఖ వైద్య అధికారులు పాల్గొన్నారు.

ఎర్రగుంటపల్లిలో మాట్లాడుతున్న ఎడిఎ రవి

యల్లనూరులో రైతులతో మాట్లాడుతున్న అధికారులు

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కేసులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండలంలో ఎక్కడైనా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని ఎక్సైజ్, ప్రొహిబిషన్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడైన మద్యం, బెల్ట్‌షాపులు నిర్వహిస్తుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఎస్ శ్రీరామ్, సీఐ నాగ సునీతారాణి, ఎస్ఐ గురురాజ భట్టు, సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

రైతులను మోసం చేసేందుకే 'రైతన్నా-మీకోసం'

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

రైతులు పడుతున్న కష్టాలు,బాధలు కనిపించనీయకుండా, దీనిమీద చర్చజరగకుండా వాటికి ముసుగు వేసి చంద్రబాబు తమ తప్పులు కప్పిపుచ్చుకోవడానికి రైతన్నా.. మీకోసం" అంటూ రైతులను మోసం చేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఆరోపించారు. సోమవారం స్థానిక వైసిపి పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలో రైతులకోసం ఏం చేశారని ఆయన సూటిగా ప్రశ్నించారు.రికార్డు స్థాయిలో పంటల ధరలు దారుణంగా పతనమైనా మీరు రైతులవైపు కన్నెత్తిచూడ్డం లేదన్నారు. ప్రభుత్వం నుంచి ఏమాత్రం ఆసరాలేక రైతులు తాము వేసిన పంటలను తామే ట్రాక్టర్లతో దున్నివేసే పరిస్థితులు తీసుకు వచ్చారని ఆరోపించారు. ధరలు పతమై దీన స్థితిలో రైతన్న ఉన్నాడని ధరల స్థిరీకరణకు వెంటనే డబ్బులు మంజూరుచేసి, రైతుల్ని ఆదుకునే చర్యలను ఎందుకు

విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

చేపట్టలేదని ప్రశ్నించారు. ఇప్పుడు కూడా ధాన్యం, మొక్కజొన్న, అరటి, పత్తి ధరలు దారుణంగా పడిపోయినాయని మీరు అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ధాన్యం,కందులు, మినుములు,పెసలు,సజ్జలు,మిర్చి, పొగాకు, ఉల్లి, టమోటా, ఆరిటి, పత్తి ధరలు పడిపోయినా మీకు పట్టనట్టే వ్యవహరించారన్నారు.18 నెలల కాలంలో దాదాపు 16 సార్లు ప్రకతి విపత్తుల వల్ల రైతులు నష్టపోతే కనీసం ఒక్కసారైనా ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి ఆదుకున్నారా అని ఆయన ప్రశ్నించారు. ఉచిత పంటల బీమాను రద్దుచేశారు, ప్రకతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన, రైతులకు నష్ట పరిహారం కూడా ఇవ్వలేదన్నారు. ఎన్నికల్లో రైతులకు అరచేతిలో వైకుంఠం చూపించారు. పీఎం కిసాన్‌కాకుండా ఏడాదికి రూ.20వేలు అన్నదాతా సుఖీభవ కింద ఇస్తామన్నారు. 2 సంవత్సరాలకు రూ. 40వేలకు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.10వేలు. ఇచ్చారని తెలిపారు. చివరకు ఎరువులకోసం కూడా రైతులు బ్లాక్‌లో కొనుగోలు చేసుకునే దుస్థితికి తీసుకువచ్చారని రైతుల బతుకులు దళారీల పాలు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో మీ మోసాలను, మీ వంచనను ప్రశ్నించడానికి రైతులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ పార్టీ నాయకులు వీరన్న,బసవరాజు,భరత్ రెడ్డి,ఈడిగ ప్రసాద్,అశోక్ కుమార్,ఓబన్న, కడమలకుంట సురేష్,ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.